క్లుప్తంగా

ఘనంగా గీతా జయంతి



గోకవరంలో గీతా మందిరం వద్ద హోమం నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: స్థానిక వెలమపేటలోని గీతా మందిరంలో శుక్రవారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. సనాతన ధర్మప్రబోధనా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయి బాబు ఆధ్వర్యంలో చాతుర్మాస వ్రతం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో గాజింగం చంద్రాయమ్మ, మేడా వసుంధర, గండి వాణి, గంంటా రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



గోకవరంలో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: మండలంలోని క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తులకు పవర్‌గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మందికి వీటిని అందించారు. గోకవరం మండలంలోని టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు వీటిని అందించనున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, ఎస్‌టీఎస్ వి.శ్రీనివాస్, వైద్య సిబ్బంది పవన్, రమణ, మట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోల్‌వాల్ట్‌లో రంగంపేట విద్యార్థిని ప్రతిభ



లక్ష్మీశ్రావ్యను అభినందిస్తున్న హెచ్‌ఎం

రంగంపేట: జిల్లా స్థాయి పోల్‌వాల్ట్‌లో రంగంపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అండర్–17 పోటీల్లో పోల్ వాల్ట్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని కడియం లక్ష్మీశ్రావ్య తృతీయ స్థానం సాధించి కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమెతో పాటు పీఈటీ కె.శైలను హైస్కూల్ హెచ్‌ఎం వి.పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు.

బుద్ధావతారంలో భజే నారాయణస్వామి



బుద్ధావతారంలో దర్శనమిస్తున్న భజేనారాయణస్వామి

రంగంపేట: వడిశలేరు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణ స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామివారిని బుద్ధావతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం కల్కి అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ అధికారి ముమ్మన రాంబాబురెడ్డి తెలిపారు.

ఎస్సై ఫలితాల్లో సత్తా చాటిన సంధ్యారాణి



సంధ్యారాణిని అభినందిస్తున్న తహసీల్దార్ దొరకయ్య

రంగంపేట: కూలీ పని చేసే కుటుంబంలో పుట్టినా, పట్టుదలతో ఎస్సై ఫలితాల్లో సత్తా చాటింది సంధ్యారాణి. గురువారం విడుదల చేసిన ఎస్సై ఫలితాల్లో కోటపాడు గ్రామ శివారు కోళ్లఫారానికి చెందిన అర్జంగి బాబూరావు, సత్యవతి దంపతుల కుమార్తె అర్జంగి సంధ్యారాణి ఎస్సైగా ఎంపికైంది. స్థానిక రామకృష్ణాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పాత కోటపాడు ఎంపీపీ యూపీ స్కూల్, రంగంపేట జెడ్పీ హైస్కూల్‌లో చదివింది. టెన్త్‌లో మంచి ఉత్తీర్ణత సాధించడంతో నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎస్సైగా అర్హత సాధించింది. తన అన్నయ్య కానిస్టేబుల్ అర్జంగి రాజు స్ఫూర్తితో ఈ విజయం సాధించినట్టు సంధ్యారాణి తెలిపింది. రంగంపేట తహసీల్దార్ ఎం.దొరకయ్య శుక్రవారం ఆమెను అభినందించారు.

ఉత్తర ద్వార దర్శనానికి వేళాయె..

- నేడు ముక్కోటి ఏకాదశి
- ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

బిక్కవోలు: పరమ పవిత్రమైన తిథి వైకుంఠ ఏకాదశి నాడు సాక్షాత్తు మహా విష్ణువు గరుడ వాహనంలో ముక్కోటి దేవతలతో భూలోకానికి దిగొచ్చి భక్తులకు దర్శనమిస్తారని ప్రతీతి. ఈ రోజు ఉత్తర ముఖంగా గరుడ గమనుడైన మహావిష్ణువును దర్శించడం కోసం సకల భక్తకోటి ఉవ్విళ్లూరుతోంది. గురువారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో పలు ఆలయాల్లో ఉదయం 5 నుంచి సాయంత్రం 5 వరకు శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నారు. అనపర్తిలో వేణుగోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు, బిక్కవోలు లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో, ఊలపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయం, పందలపాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో, శ్రీదేవి, భూదేవి సమేత కేశవ స్వామి ఆలయంలో, బలభద్రపురంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో, కొమరిపాలెం, తొస్సిపూడి, ఆరికరేవుల, కొంకుదురు గ్రామాల్లో, పెదపూడి మండలంలో పెదపూడిలోని జనార్దనస్వామి, దోమాడ, కరకుదురు గ్రామాల్లో, జి.మామిడాడ, పెదపూడిలో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో దర్శనాలు జరుగుతాయి. రంగంపేట మండలంలో వడిశలేరులోని భజేనారాయణస్వామి, కోటపాడులో వేణుగోపాల స్వామి, రంగంపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పందలపాకలో శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి

కోరుకొండలో..

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు శుక్రవారం అన్నవరం దేవస్థానానికి చెందిన అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు తాడి రజనీరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం 5.30 గంటల నుంచి ఉత్తర ద్వారంలో స్వామివారి దర్శనమిస్తారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాజరవుతారు.



కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

నేడు తెరుచుకోనున్న ఉత్తర ద్వారాలు

అనపర్తి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారాలు తెరుచుకోనున్నాయి. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా ఆలయంలోనికి ప్రవేశించి స్వామిని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గల వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, పాలక మండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక పాతవూరిలోని జనార్ధన స్వామి ఆలయం, సత్తి పోతారెడ్డి తేతలి రామిరెడ్డి రామాలయం, శాంతిపురంలోని లక్ష్మీదేవి ఆలయంతోపాటు మండలంలోని పొలమూరులో ఉన్న రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాల స్వామి ఆలయం తదితర చోట్ల ఏర్పాట్లు చేశారు.

తంటికొండ వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈఓ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి) తెలిపారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో శ్రీరామగిరి కొండపై వేంచేసిన సత్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం



మునగాలలో విజయలక్ష్మిని సత్కరిస్తున్న డ్వాక్రా మహిళలు

మధురపూడి: స్వయం సహాయక సంఘాలతో ఆర్థిక పురోగాభివృద్ధి సాధ్యమవుతోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం మునగాల, కాపవరం గ్రామాల్లో శుక్రవారం డ్వాక్రా మహిళలతో గ్రీవెన్స్ సమావేశం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలను మహారాణులను చేయడం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలుతో మహిళల ముఖ్యంలో చిరునవ్వు వచ్చిందన్నారు. అనంతరం విజయలక్ష్మిని సంఘాల నాయకులు సత్కరించారు. ముందుగా మునగాలలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు జాజుల రాము, కోటేశ్వర రావు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం జయంతి రావు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజా

రాజానగరం: రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని దివాన్ చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. విద్యతోనే పేద కుటుంబాలలో ఆర్థిక పరిస్థితులు మారతాయని నమ్మిన ముఖ్యమంత్రి.. అందుకు అనుగుణంగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. ఉన్నత విద్య అందరికీ అందించేలా అనేక పథకాలను అమలు చేస్తూ, ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి ప్రసాద్, ఉపాధ్యాయులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మందారపు వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వర్రావు, కోలాటి వెంకన్న, వేమగిరి కృష్ణ, అడబాల చిన బాబు, యర్రంశెట్టి ధర్మరాజు, పలివెల స్వామి, దూడల నాగేశ్వర్రావు, గంద్రి నానబ్బులు, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

సీతానగరం: ప్రజారంజక పాలన అందిస్తున్న జగన్ మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పురుషోత్తపట్నం సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి మాట్లాడుతూ జగన్ పాలనలో సంక్షేమ పథకాలు పేదల ఇంటి ముంగిటకే వస్తున్నాయన్నారు. మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, సలహా మండలి అధ్యక్షుడు చల్లమళ్ల సుజీరాజు, మండల యూత్ విభాగం అధ్యక్షుడు కోలా శ్రీను మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిపల్లి అనురాధ, ఎంపీటీసీ ఉసే ఏసమ్మ, పార్టీ నాయకులు గద్దె వీరన్నబాబు, వెంపాటి సూరిబాబు, కాండ్రు పుల్లారావు, చింతలపూడి ముత్యాలరావు, వెలిచేటి మెహర్‌బాబా (సిరి) పాల్గొన్నారు.



పురుషోత్తపట్నంలో మాట్లాడుతున్న నాయకులు

26 నుంచి పీజీ స్పాట్ అడ్మిషన్లు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 26 నుంచి 29 వరకూ పీజీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ తెలుగు 50, కామర్స్ 45, ఎకనామిక్స్ 33, పొలిటికల్ సైన్స్ 27, మేథమెటిక్స్ 29, ఫిజిక్స్ 30, కెమిస్ట్రీ 5, బోటనీ 26, జువాలజీ 20, కంప్యూటర్ సైన్స్ 10, అక్వాకల్చర్ 4, జియాలజీ 33 ఖాళీలున్నాయన్నారు. ఏపీపీజీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావును సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత

ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగుల ఉపకరణాల మంజూరుకు సంబంధించి గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ వలంటీర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ కృషితో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. శిబిరానికి హాజరైన విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాల మంజూరుకు వారి వివరాలు, కొలతలు నమోదు చేసుకుని, వచ్చే నెలలో పంపిణీ చేస్తారని వివరించారు. శిబిరం ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, అనపర్తి, బిక్కవోలు ఎంపీడీఓ కార్యాలయాల సూపరింటెండెంట్లు బీఎల్ నరసింహం, కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం జనరల్ సెక్రటరీ కొవ్వూరి ఆదిరెడ్డి, సోషల్ మీడియా విభాగం ప్రతినిధి నల్లమిల్లి సురేష్‌రెడ్డి, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల మంజూరు గుర్తింపు శిబిరంలో పాల్గొన్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

న్యాయవాదుల ఆందోళన

అనపర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన భూహక్కు చట్టంపై న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం అనపర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక దేవీచౌక్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా కెనాల్ రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. సీఐ శివగణేష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ న్యాయవాదులు మండిపడ్డారు. దీనిపై సీఐ శివగణేష్ విలేకరులతో మాట్లాడుతూ శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నాలు, రాస్తారోకోలు చేసుకోవచ్చని, ఈ ఆందోళనతో సుమారు 30 నిమిషాలు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ట్రాఫిక్‌లో అంబులెన్స్ కూడా చిక్కుకుందని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుగా సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

గైట్‌లో సదస్సు

రాజానగరం: దేశంలో నిరుద్యోగ సమస్యకు ప్రధాన కారణం ఉద్యోగాలు లేకపోవడం కాదని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అభ్యర్థులలో లేకపోవడమేనని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. బహుళ విభాగ పరిశోధన, ఆవిష్కరణలు అనే అంశంపై శుక్రవారం గైట్ డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ అయిన వెంటనే క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, పైథాన్ వంటి కోర్సులను అభ్యసించాలన్నారు. అలాగే పరిశోధనలపైనా దృష్టిని సారించాలన్నారు. అలిజోల్ టెక్నాలజీస్ సీఈఓ పవన్ చలమలశెట్టి, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అనపర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గణిత ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



గుమ్ములూరులో విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న హెచ్‌ఎం గంగాభవాని



ఆన్‌లైన్ క్విజ్ పోటీలను ప్రారంభిస్తున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

అనపర్తి: ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం పలు పాఠశాలలో మ్యాథ్స్ డేను ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఈ వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ప్రముఖ గణితావధాని మానేపల్లి నాగార్జున నిర్వహించిన గణిత అష్టావధానంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా విద్యార్థులు గణిత రంగోలి, గణిత ప్రాజెక్ట్‌ల ప్రదర్శన, టేబుల్‌పై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభను చాటారు. హెచ్‌ఎం కర్రి కళ్యాణి మాట్లాడుతూ రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాలలో రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

బిక్కవోలు: రామానుజన్ జయంతిని బిక్కవోలు హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం వీర ప్రభాకరరావు గణితంలో రామానుజన్ చేసిన సేవలను వివరించారు. గణిత పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

మధురపూడి: ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో కోరుకొండ మండలం గుమ్ములూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు తృతీయ బహుమతి సాధించారు. ఈ నేపథ్యంలో హైస్కూల్ హెచ్‌ఎం యు.గంగాభవాని శనివారం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. జాతీయ గణిత దినోత్సవం వేడుకల సందర్భంగా అభినందనలు తెలిపారు. ప్రతిభను కనబర్చిన ఎస్.అమృత వర్షిణి, గౌతమీ కావ్యలకు రూ.375 చొప్పున నగదు బహుమతి అందించారు. అలాగే గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు రూపొందించారు. వారికి గణిత ఉపాధ్యాయుడు సానపల్లి నాగేశ్వరరావు బహుమతులు అందించారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్టుమెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ రామానుజన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ క్విజ్‌ను వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. పోటీలో 876 మంది పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన వారికి ఈ – సర్టిఫికెట్లు అందించారు. తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. డాక్టర్ టి.హైమావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.



బొబ్బిల్లంకలో గణిత ఉపాధ్యాయులకు సన్మానం

సీతానగరం మండలంలో..

సీతానగరం: వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో జాతీయ గణిత దినోత్సవం, శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు, గణిత నమూనాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు లంక సీతారత్నం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఉపాధ్యాయులు విస్సా శ్రీనువాస్, వానపల్లి శ్రీనువాస్, కొమ్మనాపల్లి నాగేంద్ర, ర్యాలీ లలితాదేవి మాట్లాడారు.

= బొబ్బిల్లంక హైస్కూల్లో హెచ్‌ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయులు చింత శ్రీరామచంద్రమూర్తి, షబీనా హుస్సేన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, గణిత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రంగంపేట విద్యార్థినులు

రంగంపేట: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు తమ విద్యార్థులు ఎంపికైనట్టు రంగంపేట హైస్కూల్ హెచ్‌ఎం వి.పార్థసారథి తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలో జరిగిన జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో రంగంపేట హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు టి.ప్రసన్న, ఈ.భాను రూపొందించిన బయోమెట్రిక్ ఓటింగ్ మెషీన్ అనే ప్రాజెక్టు ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై, ప్రథమ బహుమతి పొందిందన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక పోటీలకు ఈ ప్రాజెక్టు అర్హత సాధించిందన్నారు. స్కూల్ జీవశాస్త్ర టీచర్ వి.రమ్యసుధ గైడ్ టీచర్‌గా వ్యవహరించారన్నారు. విద్యార్థినులు, గైడ్ టీచర్‌ను డీఈఓ అబ్రహం, డీవైఈఓ శ్రీనారాయణ, ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, మధుసూధనరావు, హెచ్‌ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, సీఆర్పీలు అభినందించారు.




జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీఈఓ అబ్రహం

రైతన్నను కాపాడుకుందాం..

సైకత శిల్పం రూపొందించిన దేవిన సిస్టర్స్

రంగంపేట. : జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రంగంపేటలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ సైకత శిల్పంలో ఎటువంటి నేలలోనైనా పచ్చని పంటలు పండించే రైతు నాగలితో దీనంగా దండం పెడుతున్నట్టుగా.. రైతు చుట్టూ ఉరితాడు బిగిస్తున్నట్టుగా.. అన్నదాత మరణాలతో రానున్నది ఆహార కొరత.. సేవ్ రైతన్న. అన్న నినాదాలతో సైకత శిల్పాన్ని రూపొందించారు. చూపరుల అందర్నీ ఆలోచింపజేస్తుంది ఈ సైకత శిల్పం.



ఆడుదాం ఆంధ్రా ఆటలపై అవగాహన



పందలపాక హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న సచివాలయ ఉద్యోగులు, నాయకులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాల వద్ద ఆడుదాం ఆంధ్రా ఆటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పందలపాక, తొస్సిపూడి గ్రామాలకు చెందిన సచివాలయాల ఉద్యోగులు, నాయకులు కలిసి ఆటపోటీల్లో పాల్గొన్నారు. మూడు గంటలకు పాఠశాల ఆవరణ అంతా ఆటల పోటీలతో సందడిగా మారింది. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర పోటీలు నిర్వహించారు. ప్రజలకు ఆటలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించినట్టు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

క్రీడా పరికరాల ప్రదర్శన



పందలపాకలో సచివాలయం-1 వద్ద ఆట వస్తువులు ప్రదర్శిస్తున్న నాయకులు

బిక్కవోలు: పందలపాక సచివాలయం–1 వద్ద శుక్రవారం ఆడుదాం ఆంధ్రా ఆట వస్తువుల కిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26న ఆడుదాం ఆంధ్రా ప్రారంభమవుతుందన్నారు. గ్రామస్తులు 15 ఏళ్ల పైబడిన వారు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఎంపీటీసీ మచ్చాపాప, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవ రెడ్డి, వైఎస్సార్ సీపీ జేసీఎస్ బొద్దు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

పెదపూడి: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ తదితరులు మద్దతు తెలిపారు.

గోకవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. కాగా శుక్రవారం దీక్షా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

చెకుముకి పరీక్షలకు విద్యార్థుల ఎంపిక



ప్రతిభ చూపిన శ్రీప్రకాష్ విద్యార్థులు

రాజానగరం: మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచి జిల్లా స్థాయి పరీక్షలకు ఎంపికయ్యారని దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఎఎస్ఎన్ మూర్తి, అకడమిక్ కోఆర్డినేటర్ విమల తెలిపారు. ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎం.జ్ఞానాథ (10వ తరగతి), వై.మహేంద్ర (9వ తరగతి), బద్రి (8వ తరగతి)లను అభినందించారు. జిల్లా స్థాయిలో కూడా ఇదే స్ఫూర్తితో విజేతలుగా రావాలనే ఆకాంక్షించారు.

బీమా సాయం అందజేత

రాజానగరం: అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందిన గొల్లపల్లి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా ద్వారా రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంత్యక్రియలు కూడా చేయలేని దుర్భరస్థితిలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచిన స్థానిక 2వ వార్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రగడ ఛత్రీ జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ సహకారంతో రాజమహేంద్రవరంలోని కైలాసగిరిలో అంత్యక్రియలు చేయించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు భోజన సదుపాయం కల్పించారు.

బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

సీతానగరం: విద్యార్థుల్లోని సృజనాత్మకత, సామర్థ్యాలను పెంపొందించే కార్యక్రమాలను ప్రోత్సహించాలని మండల విద్యాశాఖాధికారి కె.స్వామి నాయక్ అన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో (ఎమ్మార్సీ సెంటర్)లో శుక్రవారం గోదావరి బాలోత్సవం రెండవ పిల్లల పండగ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో జనవరి 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో కార్యక్రమం జరుగుతుందన్నారు.